క్లుప్తంగా

భోజనశాల ప్రారంభం



పీజే స్టీఫెన్‌పాల్ ఫౌండేషన్ నిర్మించిన భోజనశాలను ప్రారంభిస్తున్న గణబాబు

గోపాలపట్నం: పీజే స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ పీజే స్టీఫెన్‌పాల్, సిస్టర్ షైలాపాల్ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం లక్ష్మీనగర్–ఈ బ్లాక్ ప్రభుత్వ పాఠశాలలో భోజనశాల నిర్మించారు. నూతనంగా నిర్మించిన భోజనశాలను సోమవారం ఎమ్మెల్యే గణబాబు, స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ దైవ సేవకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ స్టీఫెన్ పాల్ దేవుడి సేవతో పాటు ఫౌండేషన్ తరఫున ఇటువటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహనరావు, సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఒకే స్థలాన్ని ఇద్దరికి అమ్మిన కేసులో జైలు

అక్కిరెడ్డిపాలెం: ఒకే స్థలాన్ని ఇద్దరికి అమ్మిన కేసులో ఇరువురికి జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ గాజువాక అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలు... మింది గ్రామానికి చెందిన మంగా విజయలక్ష్మికి 2006 సంవత్సరంలో సర్వే నంబర్ 2/16లో 35 సెంట్ల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన ఈటి రంగారావు, రెడ్డిపల్లి సత్యనారాయణలు విక్రయించారు. అదే స్థలాన్ని 2005 సంవత్సరంలో వీరిరువురు బీచ్ మినరల్ కంపెనీకి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మంగా విజయలక్ష్మి 2013 సంవత్సరంలో వీరిపై ఫిర్యాదు చేశారు. విచారణలో ఒకే స్థలానికి ఇద్దరికి అమ్మినట్టు తేలింది. దీంతో కోర్టు రంగారావు, రెడ్డిపల్లి సత్యనారాయణకు మూడేళ్లు జైలు, రూ.10వేలు జరిమానా విధించిందన్నారు.

రంగవల్లుల పోటీలు రేపు

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 8న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి, కార్యదర్శి జయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం నుంచి వైశాఖి స్పోర్ట్సు పార్కులో పోటీలు నిర్వహిస్తామన్నారు. వనితా వాకర్స్ క్లబ్ సభ్యులతోపాటు నగరంలోని ఇతర ప్రాంతాల మహిళలు కూడా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఎం.ప్రమీల 9396255654, ఆర్.స్నేహలత 7207287600ను సంప్రదించాలని సూచించారు. పోటీలో పాల్గొనే సభ్యులు వారికి అవసరమైన రంగులు, ముగ్గు పిండి, ఇతర సామగ్రి తెచ్చుకోవాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గం




ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, దురాణి, కిషోర్, సుధాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా ధర్మాల రాజశేఖర్ రెడ్డి, సెక్రటరీగా సరగడ ఈశ్వరరావు, కోశాధికారిగా విప్పర్తి లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టీవీఎస్ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సత్యారావు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ అండగా... నిశ్చింతగా పండగ

సంక్రాంతి సందడి మొదలైంది. కొత్త వస్త్రాలు, ఇతర షాపింగ్‌లతో ప్రజలు బిజీబిజీగా ఉన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పండగకు సొంత ఊళ్లు వెళతారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. ఇలాంటి తరుణంలో అప్రమత్తంగా **ఉండాలని** పోలీసులు సూచిస్తున్నారు. **పండగకు** సొంత ఊళ్లకు వెళ్లేవారు **తమకు ముందే** సమాచారం ఇవ్వాలని **కోరుతున్నారు.** ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ **హౌస్ మానిట**రింగ్ సిస్టమ్)ను **ఉపయోగించుకుని** పండగను నిశ్చింతగా **చేసుకోవాలని** సూచిస్తున్నారు.





- **పండగ వేళ చోరీలను కట్టడి చేయడానికి పోలీసుల సన్నద్ధత**
- **షాపింగ్ మాల్స్, రద్దీ ప్రాంతాల్లో** విస్తృత ప్రచారం
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో ఇళ్లకు భద్రత లభిస్తుందని భరోసా

గోపాలపట్నం: పండగ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కరపత్రాలు, ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు. మాల్స్, వస్త్ర దుకాణాల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో రక్షణ

తాళం పడితే చాలు.. దొంగలు చేతి వాటం ప్రదర్శించి కన్నం **వేస్తారు. ఈ నేపథ్యంలో** సాంకేతిక సాయంతో.. దొంగతనాలకు చెక్ **చెప్పే ఆధునిక వ్యవస్థను** నగర పోలీసులు ప్రజలకు అందుబాటులోకి **తీసుకొచ్చారు. పోలీసు శాఖ** రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ **సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)** యాప్‌ను ప్రజలు తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ **చేసుకుని రిజిస్టర్ అవ్వాలి.** ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు **ఈ యాప్ సహాయంతో** పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. **దీంతో పోలీసులు మీ** ఇంటి దగ్గర టెక్నాలజీ సహాయంతో భద్రత కల్పిస్తారు. ఈ యాప్‌ను ముందుగా.. గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎప్పుడైనా ఊరు వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీస్ నిఘాలో ఉంటుంది. ఒకవేళ దొంగలు వచ్చి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే.. అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఆ సమాచారం వెంటనే పోలీసులకు అందుతుంది. మీరు లేని సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే ఆ వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాల సహాయంతో పోలీస్ కంట్రోల్ రూంకి చేరుతాయి. ఇవన్నీ ఈ యాప్‌తోనే సాధ్యమవుతాయి. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

పండగ వేళ.. బయట ఊళ్లకు వెళితే..

- ఇంటి చిరునామా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలి. ఎప్పుడు ఊరు వెళ్తారు, ఎప్పుడు తిరిగి వస్తారో తేదీలతో సహా తెలపాలి. ఇంటి యజమాని ఫోన్ నంబరు అందజేయాలి. లేదా వాచ్‌మన్‌ను నియమించుకోవాలి.
- అపార్టుమెంట్లలో ఉన్న వారు వాచ్‌మన్‌ను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. వాచ్‌మన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చేటప్పుడు వాచ్‌మన్‌తో వారిని ప్రశ్నింపజేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు అడ్రస్, ఫోన్ నంబరు, ఎక్కడికి వెళ్తున్నదీ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.



కంచరపాలెంలో దొంగతనాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుదర్శనరావు

- అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో, ప్రవేశ ద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకండి. చిన్నపిల్లలు, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకండి.
- షాపింగ్ చేసేవారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బులతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్న చోట జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగిలించేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తుండాలి.
- కరెన్సీ నోట్లు కింద పడేసి, మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు, తెచ్చుకున్న డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది.
- డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైనంత వరకు నగదు రహిత లావాదేవీలకు మొగ్గు చూపాలి.

అప్రమత్తతతో చోరీలకు చెక్



సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే వారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. లేదా పోలీస్ యాప్ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. దీంతో ఆ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించి చోరీలకు చెక్‌పెట్టవచ్చు. పండగ షాపింగ్ చేసే సమయంలో నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైతే డయల్ 100, 1090కి నంబర్లకు ఫిర్యాదు చేయండి. పండగ సంతోషంగా చేసుకోండి.

– మంత్రి సుదర్శనరావు, ఎయిర్‌పోర్టు జోన్ క్రైం ఎస్ఐ

ఐఎన్‌టీయూసీ పాకెట్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) 2025 నూతన సంవత్సర పాకెట్ డైరీని షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాకెట్ డైరీ తో పాటు ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం బహుమతిని సీఎండీ ఖత్రి ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

మేడ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

సీతమ్మధార : మేడ పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మరణించాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే న్యూ కాలనీ కనకారావు వీధి బలరామ్ అపార్ట్‌మెంట్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో దల్లి డేవిడ్ (38) నివసిస్తున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కోసం ఆయన సోమవారం రాత్రి గాలిపటం కొనుగోలు చేశారు. అనంతరం మేడ మీద గాలిపటం ఎగుర వేస్తుండగా, కాలుజారి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ కేసుని నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఏఎస్ఐ లక్ష్మం నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో సంస్థ ప్రగతి



నూతన వ్యాపార భాగస్వాములకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. సుమారు 160 మంది వ్యాపార భాగస్వాములు హాజరయ్యారు. సీఎండీ హేమంత్‌ఖత్రి వ్యాపార లావాదేవీలను సులభతరం చేయడానికి విలువైన సమాచారాన్ని వివరించారు. భవిష్యత్తులో సంస్థకు సంబంధించిన పలు ఆర్డర్ల విషయంలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తారని చెప్పారు. సంస్థ అభివృద్ధి పథంలో నడవడానికి వ్యాపార భాగస్వామ్యం ఎంతో కీలకం అన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

విస్తృతంగా పర్యటించి.. సమస్యలు తెలుసుకుని



ఎన్టీఆర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్ కాలనీలో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం జీవీఎంసీ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికుల అభ్యర్థన మేరకు పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించినట్టు చెప్పారు. ముఖ్యంగా యూజీడీ, మంచినీటి సమస్య, శానిటేషన్ తదితర సమస్యలపై ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు అందాయని.. వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో వాటర్ ఏఈ సుమన్, నాయకులు, ఎన్టీఆర్‌కాలనీ గ్రామాభివృద్ధి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

మధురవాడలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవకాశం

మధురవాడ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ చార్జీల (టారీఫ్)పై ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడలోని విశాఖ జోన్–3 కార్యాలయం వద్ద ఈ నెల 7, 8, 10 తేదీలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియా కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రాంసింగ్, ఫైనాన్స్ మెంబర్ పీవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనదలచే వారు ముందుగా మధురవాడ సబ్‌స్టేషన్ సమీపంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. పేర్లు నమోదు చేసుకోని వారికి నియంత్రణ మండలి అనుమతితో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని జోన్–3 పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు బాలకృష్ణమ్మ



మార్పు బాలకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

మురళీనగర్ : మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడిగా గుర్తింపు పొందారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా గౌరవాధ్యక్షుడు ఏఎస్ నాయుడు అన్నారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.హేమలత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ లోకానికి ప్రాతఃస్మరణీయుడని చెప్పారు. 1974 నుంచి 1985 వరకు 11 సంవత్సరాలు ఎమ్మెల్సీగా పనిచేసి శాసన మండలిని ''ఉపాధ్యాయ ఉద్యమ వేదిక'' గా మార్చి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులకు చరిత్రాత్మకమైన రీగ్రూప్ ఇన్ స్కేల్, అప్రయత్న పదోన్నతి సాధించారని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, గ్రాట్యుటీ, పింఛను, మెరుగైన వేతన సవరణ సాధించడంలో ఆయన కీలక భూమిక వహించారని పేర్కొన్నారు. ముందుగా బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనుంజయ రావు, సేవియర్, ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరభద్రరావు, వెంకటరావు, అర్బన్ జిల్లా బాధ్యులు బి.ప్రసాద్, సీనియర్ నాయకుడు జోజి బాబు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ కోసం.. హోరెత్తిన బైక్ ర్యాలీ



కూర్మన్నపాలెం కూడలి వద్ద బైఠాయించిన కార్మికులు



చలో కలెక్టరేట్ బైక్ ర్యాలీలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

చలో కలెక్టరేట్‌కు తరలిన ఉక్కు ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సోమవారం నిర్వహించిన చలో కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున కార్మికులు తరలి వెళ్లారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పూర్తి వేతనాలు చెల్లించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లతో ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌లో ప్రస్తుతం పూర్తి ఉత్పత్తి ఉన్నప్పటికీ యాజమాన్యం ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. నాలుగు నెలల్లో 285 శాతం జీతం యాజమాన్యం పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలుగు ప్రజలకు జీవనాడి అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ నిర్వహణకు అవసరమయ్యే ఇనుప గనులు కేటాయిస్తామని 8వ తేదీన విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

ట్యాక్స్ హాలీడే ప్రకటించాలి

సంస్థ మనుగడ కోసం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేయాలని, మూడేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ పీఎఫ్, త్రిఫ్ట్ సొసైటీ, ఎస్ఎబీఎఫ్, ఫ్యామిలీ బెనిఫిట్‌లు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి. గంగారావు, నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, వై.టి. దాస్, బొడ్డు పైడిరాజు, డి.వి రమణారెడ్డి, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర జిల్లాల కబడ్డీ పోటీల విజేతలకు అభినందన



ట్రోఫీ స్వీకరిస్తున్న జిల్లా మహిళా కబడ్డీ జట్టు

గాజువాక: ఈనెల 3, 4, 5 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతర జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో విశాఖ జట్లు ప్రతిభ చూపాయి. బాల బాలికల విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించి చాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నాయి. కబడ్డీ ఫైనల్స్‌లో విశాఖకు చెందిన బాలికల జట్టు కర్నూలు జట్టుపై పది పాయింట్ల తేడాతో ప్రథమ స్థానాన్ని, బాలుర విభాగంలో విశాఖ జట్టు కర్నూలు జట్టుపై 12 పాయింట్ల తేడాతో మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంది. చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్న విశాఖ కబడ్డీ జట్లను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పద్మజాబాల, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన సీఈవో వి.వీరలంకయ్య, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2 విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్న వియ్యపు అప్పారావు (47) గత నెల 27న సైకిల్‌పై నైట్ షిఫ్ట్ విధులకు బయల్దేరాడు. బీసీ రోడ్డులోని మొదటి బ్రిడ్జి వద్ద అతను కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. స్టీల్ ప్లాంట్ సీఐ కేశవరావు నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాస హక్కుల ఉద్యమ సవాళ్లపై 9న సదస్సు



సదస్సు కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నేతలు

సీతమ్మధార : విశాఖ నివాస హక్కుల పోరాట దినం సందర్భంగా వర్తమానంలో నివాస హక్కుల ఉద్యమ సవాళ్లు – కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు 9న నిర్వహిస్తున్నామని పీవోడబ్ల్యూ నాయకురాలు లక్ష్మి తెలిపారు. ఎంఎస్ఎస్ఎస్, పీవోడబ్ల్యూ నగర కమిటీలు సంయుక్తంగా రైల్వే న్యూ కాలనీ దరి సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించే సదస్సుకు కర్ణాటక హైకోర్టు న్యాయవాది, కార్మిక సంఘాల నాయకుడు కామ్రేడ్ బాలన్, జె.వి.చలపతిరావు, వీవీ రమణమూర్తి, టి.శ్రీరామ్మూర్తి, ఎస్‌పీ రమణ, యం.వెంకటేశ్వర్లు, కేపీ రమణ, కె.రవి, కె.నిర్మల హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆర్టీసీ కాంప్లెక్సు దరి జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం ఆవిష్కరించారు. 2012లో చేపట్టిన పోరాటానికి గుర్తుగా జనవరి 9న విశాఖ నివాస హక్కుల పోరాట దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశాన్ని కార్పొరేట్ల పరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మురికివాడల్లో నివసిస్తున్న పేద ప్రజల జీవన స్థితిగతులను మార్చడానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. ఎస్.వెంకటలక్ష్మి, రోహిణి దేవి, లక్ష్మి, పరదేశి, కె.బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు

మాదక ద్రవ్యాలతో మనిషి పతనం

అగనంపూడి: మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు మానవ మృగాలుగా మారిపోతున్నారని.. విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు అన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం సత్ప్రవర్తన – ఉజ్వల భవిష్యత్ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత గంజాయి మత్తులో జోగుతుందని, ఆమత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. మత్తుకు అలవాటు పడిన వారు పతనమై కుటుంబానికి శోకం మిగుల్చుతున్నార న్నారు. బ్రహ్మకుమారీస్ జిల్లా కోఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి అక్కయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైందని, ఈ దశలో మనసును ఆధీనంలో ఉంచుకుంటే తర్వాత జీవితం ఉజ్వలంగా ఉంటుందన్నారు. రోజూ యోగా, మెడిటేషన్ చేయాలన్నారు.